నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | జనవరి 9, 2024 | www.navatelangana.com

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం(140/2018) ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం లైజన్ ఆఫీసర్ కిరణ్ కుమార్, మాదసి మల్లేష్, చిరంజీవులు, శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ డేగల ప్రవీణ్, ఏరియా సెక్రటరీ అందే వెంకటేష్, ట్రెజరర్ గోదారి మురళి, జాయింట్ సెక్రటరీ శెట్టి శంకరయ్య, మెడ పెద్దయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుక్క శ్రీనివాస్, అడ్వైజర్ గున్నిగంటి నర్సింగరావు, ఎస్ఆర్‌పి-1 పిట్ సెక్రటరీ కమల్ కుమార్, అన్ని గనుల పిట్ సెక్రటరీలు, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు పాల్గొన్నారు.



ఘనంగా భీమదేవర జెండా పండుగ

నవతెలంగాణ-దహెగాం

మండల కేంద్రంతో పాటు మండలంలోని బీబ్రా, హతిని, పిపిరావు కాలనీ, ఖర్జి తదితర గ్రామాల్లో సోమవారం ఆదివాసీ మన్నెవార్ కొలావార్ గిరిజన సంఘం ఆధ్వర్యంలో భీమ దేవర జెండా పండుగను ఘనంగా జరుపుకున్నారు. జెండాను ఆవిష్కరించిన అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన హక్కుల కోసం కలిసి కట్టుగా పోరాడి సాధించుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో మన్నెవార్ సంఘం నాయకులు అల్లకొండ లక్ష్మణ్, శ్రీకాంత్, శ్రీనివాస్, పున్న దామోదర్, బక్కన్న, సర్పంచులు బండ కృష్ణమూర్తి, పుప్పాల లక్ష్మీ పాల్గొన్నారు.



కుష్టు రోగులను ప్రతి నెల పరీక్షించాలి: డాక్టర్ గజానన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని కుష్టు రోగులను ప్రతి నెల పరీక్షించాలని జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ గజానన్ అన్నారు. సోమవారం పట్టణంలోని పుత్లిబౌలి పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆశా కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చికిత్సలో ఉన్న కుష్టు రోగులు క్రమం తప్పకుండా ఎండీటీ చికిత్స తీసుకునేలా చూడాల్సిన బాధ్యత ఆశా కార్యకర్తలపై ఉందన్నారు. కుష్టు వ్యాధి అనుమానితులను గుర్తించి ఆస్పత్రికి పంపించాలని కోరారు. ఈ సమావేశంలో వైద్యాధికారి ఆస్పియా ఫాతిమా, డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్‌రావ్, సీఓ నవీన్, స్టాఫ్‌నర్సులు నీలా, సుజాత, ఇర్ఫానా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బేల మండలంలోని పలు గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని యువజన కాంగ్రెస్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కోరారు. ఈ విషయమై సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు ఆడే.శంకర్ మాట్లాడుతూ బేల మండలంలోని దేవుజీ గూడ, కడ్కి, సదల్‌పూర్, వరూర్ గ్రామాల్లోని చేన్లలో బోరు బావులు ఉన్నప్పటికీ త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అక్కడున్న రైతులకు పంటలు పండించడం ఇబ్బందిగా మారుతోందన్నారు. ఈ గ్రామాల్లో ఎక్కువగా ఆదివాసీ కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. ఈ గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కోడప బింరావు, నాందేవ్, సీతారాం ఉన్నారు.

మిషన్ భగీరథ నీటిని అందించాలి



నవతెలంగాణ-తలమడుగు

తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల్లోని 110 గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరాను సక్రమంగా చేయాలని జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి కోరారు. సోమవారం హైదరాబాద్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఎఎన్‌సీ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. 110 గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి కష్టాలను తొలగించాలని కోరారు. సుంకిడి గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న సంపు పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కంది శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లో సోమవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు వినోద్, వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు, వెడ్మ బొజ్జుతో పాటు ఆదిలాబాద్, బోథ్, నిర్మల్ అసెంబ్లీ ఇన్‌చార్జిలు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడే గజేందర్, కూచాడి శ్రీహరిరావు హాజరయ్యారు. ఈ సందర్భంలో సీఎం రేవంత్‌రెడ్డితో ఆదిలాబాద్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. జిల్లాలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సీసీఐ పునఃప్రారంభం, చనకా-కొరటా బ్యారేజి నిర్మాణాన్ని పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనలేం..తినలేం..!

- మండుతున్న నిత్యావసర సరకుల ధరలు
- అమాంతం పెరిగిన పప్పులు..బియ్యం రేట్లు
- ఘాటెక్కిన మిర్చి..వంకాయలు కిలో రూ.110
- కూరగాయలు..ఆకుకూరల ధరలు రెక్కలు
- పండగ పూట పేదలపై తీవ్ర ఆర్థిక భారం

నిత్యావసర ధరలకు రెక్కలు రావడంతో సామాన్యుల జీవనం కష్టంగా మారుతోంది. రోజంతా కష్టపడి కూలీ పనిచేస్తే వచ్చే వేతనం కంటే కొనుగోలు చేసి తినాల్సిన వస్తువుల ధరలు అధికంగా ఉండటంతో నిరుపేదలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సరుకులు కొనలేక..మూడు పూటలు తినలేక తీవ్రంగా సతమతమవుతున్నారు. రోజువారీగా భోజనంలో వినియోగించే బియ్యం, పప్పుల ధరలు ఆకాశన్నంటడంతో పాటు కూరగాయలు, ఆకుకూరల ధరలు అదే స్థాయిలో భయపెడుతున్నాయి. ఫలితంగా నిరుపేదలు, చిరుద్యోగులు పౌష్టికాహారం తీసుకునేందుకు తీవ్రంగా సతమతవుతున్నారు. ఫలితంగా రానున్న సంక్రాంతి పండగకు పిండి వంటలు చేసుకోవడం కూడా కష్టతరంగా మారుతోంది. జిల్లాలో పెరిగిన ధరలను నియంత్రించేందుకు ధరల నియంత్రణ కమిటీలు ఉన్నా..అధికారులు వాటిపై దృష్టిసారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిత్యావసర ధరల పెరుగుదల ప్రజల జీవన స్థితిగతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. రెక్కాడితే కానీ డొక్కాడని అనేక కుటుంబాలు మండుతున్న ధరల ప్రభావంతో విలవిల్లాడుతున్నాయి. వారికి వచ్చే కూలీ డబ్బులతో పూర్తిస్థాయిలో సరకులు కొనుగోలు చేయడం కష్టతరంగా మారుతోంది.వీరితో పాటు చిరుద్యోగులు మరింత ఇబ్బందులకు గురవతున్నారు. వారికి ప్రతి నెలా వచ్చే అరకొర వేతనం కేవలం కుటుంబ పోషణకే సరిపోతుంది. ఇతరాత్ర వస్తువులు కొనుగోలు చేయడం, ఇంటి అద్దె,స్కూల్ ఫీజులు చెల్లించడం కోసం తీవ్రంగా తంటాలు పడుతున్నారు. వీటిని చెల్లించాలంటే తినేందుకు వినియోగించే సరకులు కొనుగోలు చేయడం తగ్గించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో నిత్యావసర ధరలు అమాంతం పెరిగిపోతున్నా ప్రభుత్వాలు తగ్గించేందుకు కనీస చర్యలు చేపట్టడం లేదు. ఓ వైపు పేదల కోసం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్నా..మరోవైపు రోజువారీ వినియోగంలో కీలకమయ్యే ధరలు తగ్గించడంలో మాత్రం శ్రద్ధ కనబర్చడం లేదు. ఏడాది నుంచి పప్పులు,బియ్యం ధరలతో పాటు కూరగాయలు, ఇతరాత్ర వస్తువుల రేట్లు ఆకాశన్నంటుతున్నా.. ప్రభుత్వాలు, అధికార యంత్రాంగాలు నియంత్రణ చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా నిరుపేదలు ధరాఘాతం కారణంగా బతకలేని పరిస్థితి కనిపిస్తోంది.

ఆకాశన్నంటుతున్న ధరలు..!

మూడు నెలల క్రితం 25కిలోల సన్నరకం బియ్యం సంచి రూ.1200 వరకు ఉండగా.. ప్రస్తుతం దీని ధర రూ.1620కి చేరింది. కొన్ని రకాల బియ్యం క్వింటాల్‌కు ఏకంగా రూ.600వరకు పెరగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. మరోపక్క పెసరి పప్పు కిలోకు రూ.113, శనగపప్పు కిలో రూ.79, వేరుశనగ రూ.139, నువ్వులు కిలోకు రూ.200, కొబ్బరి రూ.145వరకు చేరడం నిరుపేదలకు శరాఘాతంగా మారుతోంది. మార్కెట్‌లో ఈ ధరలు చూస్తే రానున్న సంక్రాంతి పండగకు పిండి వంటలు చేసుకోవడం కూడా కష్టతరంగా మారుతోందని నిరుపేదలు ఆవేదన చెందుతున్నారు. మరోపక్క కూరగాయలు ధరలు సైతం అదే రీతిలో కనిపిస్తున్నాయి. వంకాయ, బీరకాయ కిలోకు రూ.110, పచ్చి మిర్చి కిలో రూ.90, చిక్కుడుకాయ రూ.100, పువ్వుగోబి రూ.100, చింతపండు రూ.120, క్యారెట్స్ రూ.80చొప్పున ఉన్నాయి. వీటితో పాటు మిగితా కూరగాయల్లో టమాట రూ.30మినహాయిస్తే మిగితావన్ని కిలోకు రూ.50కి పైనే ఉండటం గమనార్హం. ముఖ్యంగా ఆకుకూరల ధరలు సైతం విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యులు కొనలేని..తినలేని పరిస్థితి కనిపిస్తోంది.





మతోన్మాద బీజేపీని నిలువరించేందుకు ఐక్యం కావాలి

- పెరుగుతున్న అసమానతలు
- పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు టి.జ్యోతి

నవతెలంగాణ-నిర్మల్

దేశంలోని మతోన్మాద బీజేపీని నిలువరించేందుకు లౌకిక శక్తులు ఏకం కావాల్సిన సమయం ఆసన్న మైందని, పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు టి.జ్యోతి పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ(ఎం) జిల్లా ప్లీనం సమావేశాన్ని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. దీనికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, బానోత్ సుజాత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజల మధ్య మత వైషమ్యాలు సృష్టించి రాజకీయ లబ్ది పొందాలని చూస్తోందన్నారు. గడిచిన 10 ఏండ్ల కాలంలో ప్రభుత్వరంగ సంస్థలను అమ్మడమే పనిగా పెట్టుకుందన్నారు. దేశ సంపదను ఆదానీ, అంబానీలకు దోచి పెడుతోందన్నారు. ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి నిరుద్యోగులను మోసం చేసిందని తెలిపారు. నిరుద్యోగం 50 సంవత్సరాల గరిష్ఠ స్థాయికి చేరిందన్నారు. జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, జమిలి ఎన్నికలు జరపడం అంటే పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బ తీయడమే అవుతుందని పేర్కొన్నారు. కోవిడ్ తర్వాత దేశంలో కోట్లాది మంది ప్రజలు ఉపాధి కోల్పోయారని, చిన్న చిన్న ఉద్యోగాలు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నా వారి జీవితాలు అప్పుల పాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నోట్ల రద్దు, జీఎస్‌టీ వంటి అనాలోచిత నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీశాయన్నారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, మహిళలపై లైంగిక దాడులు చేసిన వారికి అండగా బీజేపీ ప్రభుత్వాలు ఉంటున్నాయని విమర్శించారు. బిల్కిస్ భానుపై లైంగికదాడి చేసిన నిందితులను గుజరాత్ హైకోర్టు సత్ప్రవర్తన కలిగిన వారానికి విడుదల చేస్తే బీజేపీ నాయకులు వారిని ఊరేగించి స్వాగతించడంపై దేశ వ్యాప్తంగా నిరసనలు జరిగాయని పేర్కొన్నారు. అయినా కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ఏనాడూ దాని గురించి స్పందించలేదన్నారు. తాజాగా బిల్కిస్ భానుపై లైంగికదాడి చేసిన నిందితులకు గుజరాత్ హైకోర్టు ప్రకటించిన క్షమాభిక్షను సుప్రీం కోర్టు కొట్టివేసిందని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు. కేంద్రంలో మళ్లీ అధికారంలోకి రావడానికి బీజేపీ చేస్తున్న కుట్రలను ప్రజలకు వివరించి, బీజేపీకి బుద్ధి చెబుతామని తెలిపారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య, ఆర్.అరుణజ్యోతి మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలని చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. రూ.2లక్షల వరకు రుణమాఫీ వెంటనే చేయాలని, ప్రజలకిచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ప్లీనంలో పార్టీ జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్, బి.సుజాత, జిల్లా కమిటీ సభ్యులు, డాకూర్ తిరుపతి, తొడసం శంభు, ఇప్ప లక్ష్మణ్, గంగామణి, నాయకుకు, పసిఉద్దీన్, పోశెట్టి, క్లమెంట్ వెస్లీ, రాజమణి, భరత్‌బాయి, రాధ, మురళీ, పోశెట్టి, అతిక్ పాల్గొన్నారు.





రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి దుర్మరణం

- స్కూటీని ఢీకొట్టిన కంటైనర్
- తలకు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రోడ్డు ప్రమాదంలో ఓ అధికారి దుర్మరణం చెందిన ఘటన విషాదం నింపింది. మావల పోలీస్‌స్టేషన్ ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. బట్టిసావర్గాం శివారులోని దుబ్బగూడ సమీపంలో సోమవారం మధ్యాహ్నం స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని రాంగ్ రూట్‌లో వస్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీపై ఉన్న అఖిలేష్(29) తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అఖిలేష్ పట్టణంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీవాసి. జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ కార్యాలయంలో సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్‌లో ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధుల్లో భాగంగా వెళ్తుండగా ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న మావల పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కంటైనర్ వాహనాన్ని స్వాధీనం చేసుకోగా డ్రైవర్ పరారీలో ఉన్నాడు. అఖిలేష్ మరణంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది అఖిలేష్ మరణవార్త విని షాక్ తిన్నారు. మృతుడికి ఇంకా పెండ్లి కాలేదని తెలిసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

పీఆర్టీయూటీఎస్, టీయూటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో సోమవారం ఎంపీపీ బి.విశ్వనాథ్, మండల విద్యాధికారి సోమయ్యతో కలిసి పిఆర్‌టియుటిఎస్, టియుటిఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి క్యాలెండర్ అవసరమన్నారు. పనులు నిర్వహించాలంటే క్యాలెండర్‌ను అనుసరించే ముందుకు వెళ్తామని తెలిపారు. ఉపాధ్యాయులకు క్యాలెండర్ మరింత ప్రధానమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టియుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి సదాశివ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం శ్యాంసుందర్, ఎస్ శ్రీనివాస్, చింతలమానేపల్లి అధ్యక్ష, కార్యదర్శులు శివాజీ, సునీల్, పిఆర్‌టియుటిఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ రాజు, గణపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ సింగరేణి కార్మికుడి మృతి

- వైదుల్య నిర్లక్ష్యమే కారణమని కార్మిక సంఘాల ఆగ్రహం

నవతెలంగాణ - కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2వ గనికి చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్ మచ్చ రమేష్(32) గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సింగరేణి వైద్యాధికారుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. డిసెంబర్ 21న నైట్ షిఫ్ట్‌లో గనిలో విధులు ముగించుకొని నడుచుకుంటూ వస్తున్న క్రమంలో టబ్బుపై అడుగుపెట్టి జారి పడడంతో కాలుకు తీవ్ర గాయమైంది. రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించగా కాలుకు ఫాక్చరైందని గుర్తించారు. అక్కడి నుంచి గోదావరిఖని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎక్స్‌రే తీస్తున్న సమయంలో స్ట్రోక్, ఇతర అనారోగ్య సమస్యలతో మృతి చెందాడని వైద్యాధికారులు చెబుతున్నారు. గత నెల 22 నుంచి ఇప్పటి వరకు ఏరియా ఆసుపత్రిలో ఉంచుకొని సరైన వైద్యం అందించకపోవడంతోనే మృతి చెందినట్లు కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. 18 రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా సకాలంలో వైద్య పరీక్షలు, రోగ నిర్ధారణ చేయడంలో నిర్లక్ష్యం చేయడంతోనే కార్మికుడు మృతి చెందినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గని ప్రమాదంగా గుర్తించి కార్మిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్మికుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గోదావరిఖని, లొంవికుంట, కమాన్పూర్‌కు చెందిన రమేష్ మందమర్రిలోని సింగరేణి క్వార్టర్‌లో నివాసం ఉంటున్నాడు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | జనవరి 09, 2024 | www.navatelangana.com

పడకేసిన పారిశుధ్యం

నవతెలంగాణ-తాంసి

ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉండాలనే ఉద్యేశంతో ప్రతి గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులతో పాటు ఒక ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. అన్ని ఉన్నప్పటికీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాలు అపరిశుభ్రంగా ఉండటానికి కారణమవుతున్నాయి. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలోని మురికి కాలువల్లోని చెత్తను తీయకపోవడంతో మురుగు



కాలువలు మురుగు కుంపటిలా తయారైంది. కాలువల్లోని చెత్తను తొలగించకపోవడంతో దోమలు చేరడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. గ్రామానికి వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తుందని గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు పట్టించుకోని గ్రామంలోని మురగు కాలువలను పరిశుభ్రంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల మాక్ పార్లమెంట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా మాక్ పార్లమెంట్ నిర్వహించామని సెంట్ జోసెఫ్ కన్వెంట్ హైస్కూల్ ప్రిన్సిపల్ మరియా రోస్ తెలిపారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులు ఉత్సహంగా పాల్గొన్నారు. స్పీకర్, ఆయా శాఖల మంత్రులు ఏ విధంగా శాఖలు, ప్రజా సమస్యలపై గళం విప్పుతారో అలాగే సెటప్ చేశారు. విద్యార్థులు సైతం మంచి ప్రతిభను కనబర్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్ వ్యవస్థ ఎంత కీలకమన్న విషయాన్ని విద్యార్థులకు తెలియజేయడం జరిగిందన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రభుత్వాల పనితీరు తెలుసుకునేలా మాక్ పార్లమెంట్‌ను నిర్వహించామన్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు బయటకు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.



రైతులకు అన్ని విధాలా అండగా ఉంటాం

- కర్షకులపై లాఠీచార్జిని తీవ్రంగా ఖండిస్తున్నాం
- మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- ఫ్యాక్టరీని పంట పొలాల నుంచి తరలించాలని డిమాండ్

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల మధ్య ఇథనాల్ ప్యాక్టరీ ఏర్పాటు వద్దు అంటూ ఆందోళన చేస్తున్న రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రైతులపై ఇటీవల జరిగిన లాఠీఛార్జిని తీవ్రంగా ఖండిస్తున్నామని..వారిపై మోపిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. సోమవారం నిర్మల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే పచ్చటి పంట పొలాల మధ్య ఇథనాల్ ప్యాక్టరీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. పరిశ్రమ ఏర్పాటుకు ముందు మాతో కానీ రైతులతో కానీ కేంద్ర ప్రభుత్వ అధికారులు ఎలాంటి చర్చలు జరపలేదని పేర్కొన్నారు. 2023 ఫిబ్రవరిలో కేంద్రం అటవీ, పర్యావరణ శాఖ నుంచి ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించకుండా అనుమతులు మంజూరుచేసిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ అనుమతుల తర్వాతే రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ అనుమతులు మాత్రమే మంజూరు చేసిందని తెలిపారు. దీంట్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రమేయం ఏమి లేదని అనుమతుల మంజూరు ప్రక్రియ కేంద్ర పరిధిలో ఉంటుందని వెల్లడించారు. ఎన్నికలకు ముందే రైతులు ఆందోళన చేస్తున్నప్పుడు వారికి మద్ధతు తెలిపామని, అవసరమైతే పరిశ్రమను పచ్చటి పంట పొలాలు నుంచి తరలిస్తామని రైతులకు స్పష్టమైన హామినిచ్చినట్లు తెలిపారు. ఎన్నికల తర్వాత ఇథనాల్ ప్యాక్టరీ పనులు ఎందుకు ప్రారంభించారో అధికార కాంగ్రెస్ పార్టీ, స్థానిక బీజేపీ ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రధాన అనుచరులు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారని తెలిపారు.

దీని వెనుక ఎవరు ఉన్నారో రైతులు గ్రహించాలని సూచించారు. డబ్బులు తీసుకుని ల్యాండ్ ఇప్పించింది ఎమ్మెల్యే అనుచరులేనని ఆరోపించారు. చేసిదంతా బీజేపీ వాళ్లు చేసి మాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పరిశ్రమ రద్దు లేదా తరలింపు అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉందని దీనిపై కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పంట పొలాల మధ్యలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీని తరలించే వరకు రైతులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

పేదల ఆకలి తీర్చేందుకే బొజ్జన్న బువ్వ



నవతెలంగాణ-ఉట్నూర్

తమ సమస్యలను ప్రతి సోమవారం ఐటీడీఏ కార్యాలయానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారుల కోసం బొజ్జన్న బువ్వ కార్యక్రమాన్ని చేపడుతున్నారని కొత్తగూడ సర్పంచ్ ఆత్రం రాహుల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట బొజ్జన్న అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పేదల ఆకలిని తీర్చేందుకే ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ అన్నదాన కార్యక్రమం ప్రతి సోమవారం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్, మాజీ సర్పంచ్ భీమన్న, మాజీ మండల అధ్యక్షులు దుటా రాజేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు ఇక్బాల్, నాయకులు మహేందర్, మెస్రం నగేష్, అక్షయ్ పటేల్, మహిళలు, బొజ్జన్న సైన్యం సభ్యులు పాల్గొన్నారు.

దీక్ష భూమి జాతరకు ఆహ్వాన పత్రిక అందజేత



నవతెలంగాణ-ఉట్నూర్

శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ దీక్ష భూమి జాతరకు మహోత్సవ కార్యక్రమానికి ఐటీడీఏ పీఓ చాహత్ భాజ్‌పాయ్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌లను సోమవారం ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. నార్నూర్ మండలంలోని శ్రీ సంత్ సేవాలాల్ దీక్ష భూమి కొత్తపల్లి(హెచ్) జాతర మహోత్సవం గురువారం 11 నాడు భారీ ఎత్తున్న జరుగుతుందని కమిటీ అధ్యక్షులు జాదవ్ రెడ్డినాయక్ అన్నారు. లంబాడా ప్రజలు ఇతర రాష్టాల నుంచి కూడా వస్తారని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తామని అన్నారు.

అప్పుల బాధలో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న



నవతెలంగాణ-ఇచ్చోడ

పంటల దిగుబడి రాక, పంటలకు గిట్టుబాటు ధరలు లేక, అప్పుల ఊబిలో చిక్కుకున్న రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న కోరారు. సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని బైల్ బజార్‌కు వెళ్లి ఎడ్లను అమ్ముతున్న రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఖరీఫ్‌లో పత్తి, సోయాబీన్, మినుము, పెసర, జొన్న, తదితర పంటలకు బ్యాంకు రుణాలు సకాలంలో అందక, ప్రయివేటు వ్యాపారస్తుల నుంచి అప్పులను తీసుకొని ప్రకృతి సహకరించక పోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక తమకు వ్యవసాయనికి ఉపయోగపడే ఎడ్ల జతలను తాము అమ్ముతున్నారని పేర్కొన్నారు. కష్టించి పండించిన పంటలు సరిగ్గా పండకపోవడంతో, ప్రకృతి సహకరించక పోవడం మూలంగా తాము ఎళ్లవేలల మా కంటి ముందర ఉండే ఎడ్ల జతలను అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపూరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పంట రుణ మాఫీ జరుగక పోవడంతో, రైతుబంధు సకాలంలో అందక పోవడం మూలంగా ఎడ్ల జతలను అమ్ముకుంటుప్నామని రైతులు ఆవేదనతో తెలిపారు. పండించిన పత్తి, సోయాబీన్ పంటలకి సరిగ్గా మద్దతుధర లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కనికరించి, పంట రుణమాఫీ రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేసి, రైతులకు కొంతవరకైనా అప్పుల నుంచి ఉపశమనం కల్పించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులను వెంటనే విడుదల చేసి, ఆర్థిక భరోసా కల్పించే విధంగా ప్రయత్నం చేయాలనీ కోరారు. ఆయన వెంట రైతులు బాబు, రోహిదాస్, శివలాల్, సుభాష్ ఉన్నారు.

తానా ప్రశంసా పత్రాలు అందుకున్న లక్షెట్టిపేట్ విద్యార్థులు



నవతెలంగాణ-ఉట్నూర్

తానా ప్రశంసా పత్రాలను లక్షెట్టిపేట్ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు అందుకున్నారు. వందే విశ్వమాతరం పేరుతో చిగురుమళ్ల శ్రీనివాస్ వంద దేశాల్లో నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రలో భాగంగా తానా అమ్మ నాన్న, గురువు శతక పద్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అందులో భాగంగా లక్షెట్టిపేట్ విద్యార్థులు పద్యాలు చదివి తానా ప్రశంస పత్రాలు అందుకున్నారు. అందులో పి.నిఖిల్, కే సూరజ్, డి మారుతి, ఎం.వరుణ్ సందేశ్, జీ.రాజేశ్వర్, టి.గురురాం, టి.మహేష్, జే.నవీన్, కే.జంగు, కే.రాంసాయి, కే.తుకారాం, నాగచైతన్య ఉన్నారు. మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల లక్షెట్టిపేట్‌లో విద్యార్థులు చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన అమ్మ శతకం, నాన్న శతకం, గురువు శతకాలలోని పద్యాలను కంఠస్థం చేసి గానం చేశారు. వచ్చిన ప్రశాంస పత్రాలను పాఠశాల ఉపాధ్యాయులు వార్డెన్ రాథోడ్ ప్రకాశ్, ఏ.భూమేష్, జే.వీరేందర్, బాపురావు, మధుసూదన, ధరంసింగ్, ఓం ప్రకాశ్, ఆర్తి, జైవంత రావు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. కార్యకర్తల ఇంటికి వెళ్లి బాధిత కార్యకర్తలను పరామర్శించి, ఆయన మాట్లాడారు. సోమవారం బీఆర్ఎస్‌కు చెందిన కార్మిక విభాగ అధ్యక్షురాలు బియ్యాల అనసూయతో పాటు సివిల్ సప్లై సభ్యురాలు తులసి, కార్యకర్తలు ఉమా మహేశ్వరితో పాటు రమ కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్య పరిస్థితులకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు ఎవరు నిరుత్సాహపడవద్దని ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట ఇజ్జగిరి నారాయణ, సురేఖ, అంజలి ఉన్నారు.

మంజూరైన నిధులను విడుదల చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణాభివృద్ధి నిమిత్తం గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణి ఫిర్యాదుల విభాగంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణవాసుల ఇక్కట్లను దూరం చేయడం, స్థానికంగా మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. మాజీ మంత్రి జోగు రామన్న ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు అయ్యాయని, ప్రస్తుతం వాటిని నిలిపివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని అన్నారు. పట్టణంలోని పలు వెనుకబడ్డ ప్రాంతాల్లో, విలీనమైన వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నిధుల నిలిపివేతతో ఆ పనులు ఆగిపోతాయని, దాని ద్వారా ప్రజలకు తీవ్ర ఇక్కట్లు ఎదురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. పట్టణాభివృద్ధికి ఆటంకం కలిగేలా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే సైతం సదరు విషయంపై దృష్టి సారించాలని కోరారు. లేనిపక్షంలో కౌన్సిల్ సభ్యులతో కలిసి ధర్నాలు చేపడతామని స్పష్టం చేశారు. అవసరమైతే న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించి, నిధులు విడుదల అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆవుల వెంకన్న, ఇమ్రాన్, మిషు, భూమన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రాన్ని అందజేసిన మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమందర్

బీఆర్ఎస్, కాంగ్రెస్ మ్యాచ్ ఫిక్సింగ్



నవతెలంగాణ-లక్ష్మణచాంద

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్ అయ్యాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు,పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ ఆరోపించారు. సోమవారం మండలంలోని వడ్యాల్ గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలే తప్ప ప్రజా సంక్షేమం గురించి ఆలోచన చేయటం లేదని ఎద్దేవా చేశారు. ప్రజాపాలన పేరుతో కాలయాపన చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నదన్నారు. అధికారంలోకి రాగానే రైతు రుణమాఫి చేస్తామని, రైతుబంధు, డబ్బులు ఖాతాతో వేస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజుల పాలన పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు రుణమాఫీ చేయలేదని అన్నారు. రైతు బరోసా డబ్బులు జమ చేయలేదని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి కాళేశ్వరం అవినీతిపై సీబీఐ ఎంక్వయిరీ కావాలని డిమాండ్ చేసి, ఇప్పుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత జ్యుడీషియల్ ఎంక్వైరీ మాత్రమే చేస్తామనటం కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని అనటానికి నిదర్శనం అన్నారు. దమ్ముంటే సంస్థ ఎంక్వైరీ కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, బీజేపీ మండల అధ్యక్షుడు పొలస గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి అల్లూరి రాజు, నాయకులు కొండ్రు మోహన్, మల్లేష్, నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాల అనుమతులు రద్దు చేయాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్



డీఈఓకు టి.ప్రణీతకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మావల మండల పరిధిలోని ఎస్ఆర్ ప్రైమ్ ప్రయివేట్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్మోహన్‌రావు గత ఐదు ఆరు నెలల నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తున్నారని వెంటనే సదరు పాఠశాల అనుమతులు రద్దు చేయాలని సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్, డీఈఓ టీ.ప్రణీతకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న దళిత అమ్మాయిని ప్రిన్సిపల్ లైంగికంగా వేధించడం కలచి వేసిందన్నారు. ఎంతో మానసిక క్షోభకు గురైన విద్యార్థిని, తన తల్లిదండ్రులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సంఘటన వెలుగులోకి వచ్చిందని తెలిపారు. సదరు పాఠశాలలోని ప్రిన్సిపల్ అనేక మంది విద్యార్థినులను ఇదే రీతిలో వేధించాడని గతంలో ఫిర్యాదులు కూడా అందాయని ఆరోపించారు. సభ్య సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయుడు దిగజారి ప్రవర్తించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, వెంటనే పాఠశాల అనుమతులను రద్దు చేయాలని కోరారు. కీచకుడైన ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసి చట్టరీత్యా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ పక్షాన ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాదిగ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి(ఎంఎస్ఎఫ్) బైరపోగు శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పసుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2024 లోక్ సభ ఎన్నికల దృష్ట్యా తెలంగాణ లోక్ సభ నియోజకవర్గాలకు బీజేపీ అధిష్టానం ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఆదిలాబాద్ ఎంపీ స్థానానికి ఎమ్మెల్యే పాయల శంకర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. దీంతో రానున్న ఎన్నికల సన్నద్ధతపై పార్టీ శ్రేణులు దృష్టి సారించాలని తెలిపారు. ఆదిలాబాద్ ఎంపీ స్థానం బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి

- వ్యవసాయాధికారి మంగ్లారపు ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని చామన్‌పల్లి, పీచర గ్రామాల్లో పంటల నమోదు జరుగుతున్న తీరును సోమవారం మండల వ్యవసాయధికారి మంగ్లారపు ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. ప్రతి ఒక్క రైతు విధిగా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. పంటల నమోదు తప్పనిసరి అని అన్నారు. రైతులు పంట నమోదు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పవిత్ర, సర్పంచ్ బుర్రి లత భూమేష్, ఎంపీటీసీ తిప్పని రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి రూ.10వేల ఆర్థిక సాయం




నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన వేముల రాజన్నకు యాదవ్ సంఘం తరపున రూ.10వేల ఆర్థిక సాయం చేసి ఉదారతను చాటుకున్నారు. మానవసేవే మాధవ సేవ అని దాతలు ముందుకొచ్చి కిడ్నీ బాధితునికి సహకారం అందించాలని కోరారు.

నెంబర్ ప్లేట్ లేకుండా తిరగొద్దు

- ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ట్రాఫిక్ చలన్ నుంచి తప్పించుకునేందుకు ద్విచక్ర వాహనదారులు నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుతున్నారని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సోమవారం పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో ఈ డ్రైవ్ నిర్వహించగా వాహనాలను పట్టుకుని, నెంబర్ ప్లేట్స్ పెట్టిన తరువాత వాటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలో అనేక మంది నెంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నారన్నారు. అలాంటి వాహనాలను పట్టుకోవడానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు తన వాహనానికి సంబంధించి పత్రాలతో పాటు నెంబర్ ప్లేట్స్, హెల్మెట్ ధరించాలని సూచించారు. అదే విధంగా చాలా మంది మైనార్ పిల్లలు వాహనాలు నడుపుతున్నారని, తొలిసారి తల్లిదండ్రులకు కౌన్సింగ్ ఇస్తామని, మరో సారి పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేయొద్దని సూచించారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.

నవతెలంగాణ
మంగళవారం | జనవరి 09, 2024 | www.navatelangana.com

కుమురంభీం ఆసిఫాబాద్

విద్యార్థులకు అల్పాహారం అందజేత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని చెడువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించారు. సోమవారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సందర్భంగా వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రామానికి చెందిన కౌసల్యమ్మ పిల్లలకు స్నాక్స్ అందించి ఉదారత చాటారు. దాతలు పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాల బలోపేతం కోసం వారి సహకారం అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మెన్ రమేష్, ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయులు టి రాకేష్, ఉపాధ్యాయులు గంగారం, నరహరి, వెంకటేష్, నుస్రత్ సుల్తాన్, ఉత్తం, చందు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాజగోపాల్ అన్నారు. సోమవారం తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో గ్రామీణ బ్యాంక్ రుద్రారం బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ కర్నూల్ కళాజాతతో బ్యాంకు పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు స్కీమ్స్, విద్య, బంగారం రుణాలు, సామాజిక భద్రత పథకాలు ప్రధానమంత్రి సురక్ష, జీవనజ్యోతి భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, నగతురహిత లావాదేవీలు, సైబర్ మోసాలపై జాగ్రత్తలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు మాటలు, పాటలు, మ్యాజిక్ షో ద్వారా కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఓ

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేల ప్రణాళిక బద్ధంగా చదవాలని ఎలుకపెల్లి సర్పంచ్ గణపురం కావ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో బోధనలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరై మంచి మార్కులు సాధించేల కష్టపడి చదవాలని సూచించారు. ప్రభుత్వం ప్రయివేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాల్లో ఎల్ఈడీ డిజిటల్ తరగతులను నిర్వహిస్తుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెనకబడిన విద్యార్థులు కూడా మంచి ప్రదర్శన కనబరిచేలా ఉపాధ్యాయులు వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అదే విధంగా మధ్యాహ్న భోజనం మేను ప్రకారం అందించాలని, ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేల తన వంతుగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుమురంభీం స్ఫూర్తితో పోరాడాలి

- మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

జల్, జంగిల్, జమీన్ కోసం పోరాడిన వీరుడు కుమురంభీం స్ఫూర్తితో ఆదివాసులు హక్కుల కోసం పోరాడాలని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని గన్నారం గ్రామంలో సోమవారం కుమురంభీం విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆదివాసీ కొలాంలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతికగా కుమురంభీం విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దోతుల శ్రీనివాస్, ఆదివాసీ మన్యవార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్స వెంకటేష్, నాయకులు సుంకే కిష్టయ్య, చింతపురి పోచయ్య, కన్నెపల్లి పోచయ్య, బుర్స సురేష్, మనోహర్ గౌడ్, గువ్వల లస్మయ్య, పుల్లబోయిన బానయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ బాధ తట్టుకోలేక ఐచర్ యజమాని ఆత్మహత్య



నవతెలంగాణ-జైనూర్

ఫైనాన్స్ వారి బాధతో ఐచర్ వాహనం యజమాని తన వాహనికే ఉరేసుని ఆత్మహత్య చేసుకున్న ఘనట మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై సందీప్ కుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన షేక్ రియాజ్(40) ఐచర్ డ్రైవర్‌గా పని చేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థికంగా ఎదగాలని ఫైనాన్స్‌లో ఐచర్ వాహనాన్ని సంవత్సరం క్రితం కొనుగోలుచేశారు. నెలల వారీగా కిస్తీ రూపంలో డబ్బులు చెల్లిస్తున్నాడు. కొన్ని నెలల నుండి ఐచర్ వాహనానికి సరైన కిరాయిలు లేక ఇబ్బందులు పడ్డాడు. ఫైనాన్స్ వారికి సమాదానం చెప్పలేక, వారి బాదను తట్టుకోలేక సోమవారం మార్కెట్ యార్డు ముందు తన ఐచర్ వాహనానికే ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సామెల గ్రామ మాజీ ఎంపీటీసీ గుర్నులే పోచ్చయ్య(60) మృతి చెందారు. కొంత కాలంగా నుంచి అన్యారోగ్యంతో బాదపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. ఎంపీటీసీగా ఆయన చేసిన సేవలను పలువురు గుర్తు చేసుకుంటు కుటుంబానికి సానుభూతి ప్రకటించారు.

యువత స్వయం ఉపాధిలో ముందుకు రావాలి

నవతెలంగాణ-జైనూర్

యువత స్వయం ఉపాధిలో ముందుకు రావాలని సీఐ మల్లేష్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని గౌరీ రోడ్డు వద్ద నూతన గోల్డెన్ ప్రింటింగ్ ప్రెస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు స్వయం ఉపాధిలో ముందు ఉండాలన్నారు. కేవలం ప్రభుత్వ ఉద్యోగం కోసమే కాకుండా స్వయం ఉపాధిలో రాణించే దిశగా ప్రణాళికలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెస్రం పార్వతి లక్ష్మణ్, సయ్యద్ వజీర్ పాల్గొన్నారు.

దరిగాం అటవీ ప్రాంతంలో మరో పులి మృతి

- వివరాలు వెల్లడించని అటవీ అధికారులు
- వేటగాళ్ల ఉచ్చులో పడి మృతి చెందినట్లు అనుమానాలు
- నేడు అటవీ ఉన్నతాధికారుల రాక
- అటవీ అధికారులపై వేటు పడే అవకాశాలు..?



ఇటీవల దరిగాం అటవీ ప్రాంతంలో మరణించిన పులి(ఫైల్)

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో మరో పులి మృతి చెందింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను అటవీ అధికారులు వెల్లడించకుండా రహస్యంగా ఉంచడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. తన ఆవాసంపై ఆధిపత్యం కోసం ఇదే ప్రాంతంలో రెండు ఆడపులులు ఘర్షణకు దిగి ఒక పులి మృతి చెందిన విషయం తెల్సిందే. ఇది జరిగిన రెండు రోజులకే దీనికి సమీపంలోనే మరో పులి మృతి చెందినట్లు సమాచారం అందడంతో సోమవారం ఉదయం అటవీ అధికారులు హుటాహుటిన అటవీ ప్రాంతానికి తరలివెళ్లారు. గతంలో మృతి చెందిన పులికి 350 మీటర్ల దూరంలో ఒక కాలువలో పులి మృతదేహాన్ని కనుగొన్నట్లు తెలిసింది. కాలువలో నుండి పులి కళేబరాన్ని బయటకు తీసిన అటవీ సిబ్బంది పోస్టుమార్టం కోసం ఏర్పాట్లు కూడా చేపట్టినట్లు తెలిసింది. మృతి చెందిన ఈ పులి మెడకు వైరు బిగించి ఉండడంతో ఈ పులిని వేటగాళ్లే చంపి ఉంటారని అటవీ అధికారులు అనుమానిస్తున్నారు. అందుకే ఈ వివరాలు గోప్యంగా ఉంచి వాస్తవాలు బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. కాని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోస్టుమార్టాన్ని మంగళవారంకు వాయిదా వేశారు. రెండు రోజుల వ్యవధిలోనే రెండు పులుల మృతదేహాలు లభ్యం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా అటవీ శాఖలో సంచలనం రేకెత్తిస్తోంది. రాష్ట్రంలో అసలే పులుల సంఖ్య తక్కువగా ఉండడం, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లోనే పులుల సంతతి పెరిగి టైగర్ కారిడార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం అవుతున్న తరుణంలో రెండు పులుల మృత్యువాత ఆ శాఖాధికారులను ఆందోళనకు గురి చేస్తోంది.

వివరాల వెల్లడికి రహస్యమెందుకు..?

కాగా ఈ రెండు పులుల మృత్యువాత విషయంలో అటవీ శాఖాధికారులు గోప్యత ప్రదర్శిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఒక పులి మృతదేహాన్ని అటవీ అధికారులు కనుగొన్న సమయంలో కూడా అదే గోప్యత ప్రదర్శించారు. ఇపుడు కూడా అదే గోప్యత ప్రదర్శించడమే కాకుండా కనీసం మీడియా ప్రతినిధులను కూడా సంఘటనాస్థలానికి అటవీ అధికారులు అనుమతించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మొదటి పులి మృతి చెందడానికి ముందు సమీపంలోనే ఒక ఆవు మృతి చెంది ఉంది. దానిపై పులి దాడి చేసినట్లు ఆనవాళు స్పష్టంగా ఉన్నట్లు పశు వైద్యాధికారులు తెలుపుతున్నారు. ఆ ఆవు మృతి చెందిన తర్వాత ఈ రెండు పులులు మృతి చెందడం అనుమానాలకు మరింత బలం చేకూరుస్తుంది.

నేడు ఉన్నతాధికారుల రాక

వరుసగా రెండు పులుల మృత్యువాత పడడంతో దీనిపై విచారణ జరిపేందుకు మంగళవారం అటవీ శాఖ ఉన్నతాధికారులు కాగజ్‌నగర్‌కు రానున్నట్లు తెలుస్తోంది. పీసీసీఎఫ్ డొబ్రియల్, అడిషనల్ పీసీసీఎఫ్ (వైల్డ్‌లైఫ్) పర్గయిన్‌లు కాగజ్‌నగర్‌కు వచ్చి ఇక్కడి నుండి సంఘటనాస్థలానికి కూడా వెళ్తారని అటవీ వర్గాల ద్వారా సమాచారం. వరుసగా రెండు పులులు మృత్యువాత పడడంతో దీని ప్రభావం అధికారుల మీద పడే అవకాశమున్నట్లు కనిపిస్తుంది. కింది స్థాయి నుండి పై స్థాయి వరకు అటవీ అధికారులను సస్పెండ్ చేయడం లేదా మెమోలు జారీ చేసి వారిపై చర్యలు తీసుకుంటారా..? మొదటి పులి ఘర్షణలో మృతి చెందడం వాస్తమే అయిన రెండవ పులి మాత్రం వేటగాళ్ల ఉచ్చులో పడి మృతి చెందినట్లు అనవాలు స్పష్టంగా ఉండడంతో ఖచ్చితంగా అటవీ అధికారులపై వేడు పడేఅవకాశాలున్నాయి.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-కౌటాల

పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనాలు, బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల(సీఐటీయూ) సంఘం గౌరవ అధ్యక్షుడు వెలిశాల కృష్ణమాచారి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఎంఈఓ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌటల, చింతలమానేపల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఏడు నెలలుగా వేతనాలు, బిల్లులు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. గత ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై శ్రమ దోపిడీ విధానాన్ని అవలంభించిందని, నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టిందన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం మెనుపెస్టోలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రకటించిన రూ. పదివేల వేతనం సరైందికాదని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రూ. 26 వేలు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయని, దానికి అనుగుణంగానే వేతనాలు పెంచాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత, కల్పించాలని, కోడి గుడ్డుకు అదనంగా బడ్జెట్ కేటాయించాలన్నారు. సంవత్సరానికి రెండు జతల యూనిఫాం, ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, గుర్తింపు కార్డులు, పండగ బోనస్‌లు ఇవ్వడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. పెండింగ్, బిల్లులు సకాలంలో చెల్లించని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె. శరదా, సీఐటీయూ మండల కన్వీనర్ మొర్లే నగేష్, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు జాడి మోరేశ్వర్, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు హంస, బుర్శ పద్మా లక్ష్మీ నిర్మల, సింధుబాయి, కమల, తార పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మగౌరవ భీమదేవర జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలం కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం 22వ ఆదివాసీ కొలవార్ ఆత్మగౌరవ భీమదేవర జెండా పండుగ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సంప్రదాయ వాయిద్యాలతో గ్రామ దేవత పోచమ్మ, చిలకలయ్య ఆలయాల్లో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి 22వ ఆత్మగౌరవ భీమదేవర జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొలవార్ సేవా సంఘం మండల అధ్యక్షుడు బుర్రి నీలయ మాట్లాడుతూ ఆదివాసులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ఆర్థికంగా, విద్యా రంగాల్లో ప్రోత్సహించేల కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేకల ప్రసాద్, కొలవార్ సేవా సంఘం మండల ఉపాధ్యక్షులు మేకల కిష్టయ్య, సంఘ సభ్యులు బీబ్బెరే చిలకయ్య, శంకర్ పాల్గొన్నారు.

కౌటాల : ఆదివాసి ఆత్మగౌరవ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భీమదేవర జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామాల నుండి భీమన్న దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో కౌటాల అధ్యక్షుడు ఎడ్ల భీమయ్య జెండాను ఆవిష్కరించగా గ్రామ జెండాను డబ్బ బాపు ఆవిష్కరించారు. మన్నెవార్ల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుపల్లి బ్రహ్మయ్య గురుడుపేట గ్రామంలో సాంప్రదాయ బద్ధంగా ఊరేగింపుగా వచ్చి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ మన్నెవార్ల కులస్తులు ఐక్యంగా ఉండాలని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఆదివాని, గిరిజనులకు అందే అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐక్యత లేని కారణంగా ఆదివాసులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు.



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసులు

చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలి : జెడ్పీ చైర్మెన్



జ్యోతి ప్రజ్వన చేసి పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మెన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలని జెడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణ విద్యార్థులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ పాఠశాల క్రీడా మైదానంలో ఎంపీపీ అరిగేల మల్లికార్జున్ నిర్వహించిన ఎంపీపీ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులలోని నైపుణ్యాన్ని వెలికి తీయడంలో ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జెట్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా రవాణా అధికారి గంధం లక్ష్మి, డీఈఓ అశోక్, సింగిల్ విండో చైర్మెన్ అలిబీన్ అహ్మద్, వైస్ ఎంపీపీ సుంకరి మంగా పెంటయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, పీఈటీలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్సై కొమురయ్య, ఎలుకపెల్లి సర్పంచ్ గణపురం కావ్య ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి బోధనలు అందించాలని ఎస్సై, సర్పంచ్ అన్నారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చదిద్దడంలో వారి కృషి ఎంతో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గణపురం నగేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ నిర్మల, పీఆర్టీయూటీఎస్ మండల అధ్యక్షులు యాదగిరి, ఉపాధ్యాయులు షేక్ బడే సాహెబ్, గంగాభవాని, నగేష్, లక్ష్మి, భారతి, విజయ్ కుమార్, రమాదేవి, సాదియా, సాయి తేజ, ప్రియాంక, అర్పియ, చందన పాల్గొన్నారు.



ఘనంగా ధమ్మ పతాక ఆవిష్కరణ ఉత్సవాలు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండల కేంద్రంలో బౌద్ధ సమాజ్ ఆధ్వర్యంలో జాతీయ పంచశీల్ బౌద్ధ ధమ్మ పతాక ఆవిష్కరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలో ర్యాలీగా నాగమ్మ చెరువు వద్ద గల బౌద్ధ విగ్రహం వద్ద పూజలు చేసి బౌద్ధ వందన సమర్పించారు. అనంతరం అంబేద్కర్ భవనంలో బంతే శీల్ రతన్, విశ్వాస్ జాగ్రాప్‌లు వందన సమర్పించారు. ఈ సందర్భంగా బౌద్ధ సమాజ్ తాలూకా అధ్యక్షుడు బసాకర్ విశ్వనాథ్ మాట్లాడుతూ సిర్పూర్‌లోని నాగమ్మ చెరువులో గల బౌద్ధ విగ్రహం వద్ద రానున్న బౌద్ధ పౌర్ణమి రోజు బౌద్ధ ధమ్మా జాతర సుమూహికంగా జరపాలని నిర్ణయించామన్నారు. దేశంలోనే మొట్టమొదటి ధర్మం బౌద్ధమన్నారు. తాలూకాలోని గ్రామగ్రామాల్లో బౌద్ధ మతం విస్తరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ సమాజ్ సంఘం ఉపాధ్యక్షులు ఫుల్జేలే నామ్‌దేవ్, సమతా సైనిక్ దళ్ జిల్లా ఇన్‌చార్జి జాడి దిలీప్ కుమార్, మండల అధ్యక్షులు నాగ్రాడే రాజు, సిరిపురం బాపు, నాయకులు దొంగ్రే లహన్ రాజ్, దుర్గం శ్యామ్‌రావ్, దుర్గం రాజారాం, దుర్గం తిరుపతి, దుర్గం జయంత్, దుర్గం తులసిరం, ప్రేమ నందం ఒంగ్రే, ధనుంజయ్, దుర్గం లలిత బాయి, తిరుపతి, కామిరే వెంకటి పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డీఈఓ రవీందర్‌రెడ్డి



నవతెలంగాణ-కుభీర్

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని డీఈఓ రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి మాట్లాడారు. రానున్న పదో తరగతి పరీక్షలో విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అదే విధంగా పదో తరగతిలో ఎవరైనా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, వారికి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి, వారికి 100శాతం వచ్చేలా చూడాలని అన్నారు. దీంతో విద్యార్థులతో జిల్లా అధికారి మాట్లాడుతూ పదో తరగతి ఎంతో కీలకంగా ఉంటుందని విద్యార్థులకు సూచించారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తే వారు ఉన్నత స్థాయిలో ఉంటారని గుర్తు చేశారు. అదే విధంగా మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిసరాలను పలు రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే భోజనం రుచికరంగా మెనూ ప్రకారం అందించేలా చూడాలని తెలిపారు.

సికిల్‌సెల్ రక్త నమూనాల శిబిరం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని దహిగూడలో సికిల్‌సెల్ రక్త నమూనాల సేకరణ వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వరాజ్ మాట్లాడుతూ గ్రామంలో సుమారు 74 మంది రక్త నమూనాలు సేకరించామని అన్నారు. అందులో 49 మందికి మందులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ వైద్యశిబిరంలో ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, ఆరోగ్య కార్యకర్తలు పవార్ ప్రేమ్‌సింగ్, రోహిదాస్, ఆశా తాక్‌సండే జయ, గ్రామప్రజలు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ పక్రియ పరిశీలన



నవతెలంగాణ-కుభీర్

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ పక్రియను సోమవారం డీఈఓ రవీందర్‌రెడ్డి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను ఎంపీడీఓతో కలిసి పరిశీలించారు. మండల వ్యాప్తంగా 16వేలకు పైగా దరఖాస్తులు అందయాని, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతుందని అన్నారు. దానిని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈనెల 17వరకు ఆన్‌లైన్ పక్రియ పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. మండలంలో ఉన్న ఆయా గ్రామాల్లో నుంచి వచ్చిన ప్రజాపాలన దరఖాస్తుల్లో ఎలాంటి తప్పులు లేకుండా ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. అన్ని శాఖలకు చెందిన సిబ్బందిని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సోము, పరీక్షల విభాగం అధికారి పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీణ, సాయన్న, మండల అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

నవతెలంగాణ-హాజీపూర్



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలల్లో భాగంగా ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందిపుచ్చుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆట పాట నిర్వహించారు. మున్సిపాలిటీ రోడ్డు, మార్కెట్‌లో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు లావుడ్యా రమేష్, కొప్పర్తి రవీందర్, గొడిసెల కృష్ణ, బీర్పూరి శ్రీనివాస్, మామిళ్ళ లక్ష్మణ్, రాంటెంకి రాజా, తిరుపతి, సల్లూరి కృష్ణ, వడకపురం రవి, రాజేష్, సంతోష్, సంధ్య, నిరోషా, నాగలక్ష్మి, సమీరా పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి అందరి లక్ష్యం కావాలి

నవతెలంగాణ-జన్నారం



గ్రామాల అభివృద్ధి అందరి లక్ష్యం కావాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారని అందులో భాగంగానే వికాస భారత్ క్యాలెండర్‌లను సోమవారం పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జక్కు భూమేష్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. అనంతరం వాహనంపై ఉన్న స్క్రీన్ థియేటర్ పై కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్కు భూమేష్, ఈఓ రాహుల్, వార్డు సభ్యులు రమేష్ గంగన్న, లెక్కల మల్లయ్య, ఐకేపీ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 గనిలో ప్రమాదానికి గురై గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో వైద్య చికిత్సలో నిర్లక్ష్యంతో మృతి చెందిన మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్ కార్మికుని కుటుంబానికి న్యాయం చేసే వరకు పోరాడుతామని ఏఐటీయూసీ మందమర్రి, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శులు సాలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్ అన్నారు. గత నెల 22న గనిలో విధులు నిర్వహిస్తుండగా మైనింగ్ సర్దార్ మచ్చ రమేశకు గనిలో జారి పడి ఎడమ కాలు మడమ వద్ద ఫ్రాక్చర్ కావడంతో చికిత్స కోసం గోదావరి ఖని ఏరియా ఆస్పత్రికి తరలించారని, సరైన చికిత్స అందక మృతి చెందాడన్నారు. మైన్ యాక్సిడెంట్‌గా పరిగణించి రూ.కోటి రూపాయాల నష్ట పరిహారం, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సుభాష్ చంద్రబోస్, జోగు కేతన్, గోదారి లింగమూర్తి పాల్గొన్నారు.

భీమన్నకు గిరిజనుల ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-జన్నారం

ఆదివాసీ గిరిజన తెగకు చెందిన మాడవి వంశస్థుల ఆరాధ్య దైవం బీమన్న దేవునికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కొత్తపేట గ్రామపంచాయతీలో గల కోలంగూడా గ్రామంలో త్రిర్యాని మండల్ డోలి జెండాగూడ గ్రామం నుంచి భీమన్న దేవున్ని దాదాపు మూడు రోజుల నుంచి కాలినడకన వచ్చి కోలంగూడ గ్రామంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదిమ కొల్లం గిరిజన జాతి వారు మాడవి సాంప్రదాయం ప్రకారంగా కొత్తకోడల పరిచయ కార్యక్రమం ఆ గ్రామంలో (మాడవి గుమ్ము, శాంత) నూతన వధూవరులు సాంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుల పెద్ద మాట్లాడుతూ తమ కుల దైవం భీమన్నకు ప్రత్యేక పూజలు చేయడం ద్వారా తమ పంట పొలాలు బాగా పండి, ఆయురారోగ్యాలతో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాడవి కుల పూజారి మాడవి బాపూరావు, మాడవి ఝాడు, ఆత్రం బొజ్జు, మాణిక్ రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బూత్ స్థాయి కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక బిజోన్ సెంటర్ పోచమ్మ బస్తి 18వ వార్డులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా బూత్ నెం 58, 73కి సంబంధించిన కాంగ్రెస్ బూత్ స్థాయి కమిటీ ఎన్నుకోవడం జరిగింది. అనంతరం పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు మాట్లాడుతూ అన్ని వార్డులలో కాంగ్రెస్‌ను బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీలు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు ఉపయోగపడేలా బూత్ ఇన్‌ఛార్జీలు, కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలని కోరారు. అలాగే బూత్ ఇన్‌ఛార్జీలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తూ ప్రజల సమస్యలు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, కాంగ్రెస్ నాయకులు, అబ్దుల్ అజీజ్, మహంకాళి శ్రీనివాస్ 18వ వార్డ్ ఇన్‌ఛార్జి కృష్ణకాంత్ (కిట్టు), 3వ వార్డ్ ఇన్‌ఛార్జి రాంసాయి, గొల్ల మల్లేష్, యువ నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్రామంలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయిస్తాం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ప్రధాన కూడలిలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయిస్తామని సర్పంచ్ జాడి గంగాధర్ పేర్కొన్నారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వార్డు మెంబర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామంలో మిగిలిపోయిన పనులన్నీ త్వరగా పూర్తి చేస్తామన్నారు. డ్వాక్రా మహిళల కోసం, ప్రత్యేక భవనం ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో మిగిలిన అన్ని రోడ్లకు సిసి రోడ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి లావణ్య, ఉప సర్పంచ్ ఆసునూరి పద్మ, వార్డు మెంబర్లు, చిందం చంద్రయ్య, జాడి వెంకట్, జాడి లక్ష్మి, జునుగురి లక్ష్మి పాల్గొన్నారు.

ఆరుతడి అంతంతే..!

- యాసంగిలో తగ్గిన వరి సాగు
- కడెం నీటి విడుదల చేయకపోవడమే కారణం
- సాగునీటి విషయంలో రైతుల ఆందోళన



నవతెలంగాణ-జన్నారం



మండలంలో ఈ ఏడు యాసంగి వరి సాగు సగానికి సగం తగ్గింది. గత సంవత్సరం మండలంలో మొత్తం 34 గ్రామాల్లో 29 గ్రామపంచాయతీల రైతులు 9వేల ఎకరారల్లో వరి సాగు అయితే ఈ ఏడు యాసంగిలో రైతులు 6700 ఎకరాల్లో వారి నారు వేసుకున్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో రైతులు వరి నాటు వేస్తున్నారు. దాదాపు ఇప్పటివరకు 1700 ఎకరాలు వరి నాటు మాత్రమే పూర్తయిందని వ్యవసాయ శాఖ అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. ఈ సాగు కూడా కేవలం పంపులు, బోరు బావులు పైనే ఆధారపడి రైతులు సాగు చేసుకుంటున్నాట్లు అధికారులు పేర్కొన్నారు. మండలంలో మొత్తం 165 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మూడు ఎకరాల వరకు పెసరు 2 ఉలవలు ఒక ఎకరం జొన్న పంటలను వేశారు. కడెం ప్రాజెక్టు నుంచి ఈ యాసంగికి నీరు విడుదల చేసి ఉంటే, ఈ ఏడు కూడా దాదాపు తొమ్మిది వేల ఎకరాల్లో వరి సాగు అయ్యేదని అందుకు అంచనాలు వేశామని అధికారులు తెలిపారు. కానీ కడెం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల కాకపోవడమే యాసంగిలో సాగు తగ్గడానికి కారణమని తెలుస్తోంది.

జిల్లా వ్యాప్తంగా పరిస్థితి..

మొత్తం మంచిర్యాల జిల్లా 18 మండలాల్లో, యాసంగి పంట సాగు మందకొడిగా సాగుతోంది. సీజన్ ఆరంభమై రెండు నెలలు గడిచినా సాగుకు సరిపడా నీరు అందుతుందో లేదో అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో రైతుల్లో అయోమయం నెలకొంది. ఈ నేపథ్యంలో వరి వేయాలో.. ఆరుతడి పంటలు సాగు చేయాలో తేల్చుకోలేకపోతున్నారు. గతేడాది నిండుకుండలా ఉన్న గోదావరి ఈ ఏడు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల డ్యామేజీతో ఖాళీ అయింది. ఈ క్రమంలో వరిసాగుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు.

ఇప్పటి వరకు 62 శాతం సాగు

యాసంగి సీజన్ అక్టోబర్ చివరి నుంచి ప్రారంభమ వుతుంది. డిసెంబర్, జనవరి వరకు వరి సాగుకు అనుకూలం. యాసంగి వరి సాగు అంచనా 98,860 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 61,683(62 శాతం) సాగైంది. ఇంకా 13,285 మొలక(నర్సరీ) దశలోనే ఉంది. ఫిబ్రవరి మొదటి వారం వరకు నాట్లు కొన సాగేలా ఉన్నాయి. ఆరుతడి పంటల సాగు సైతం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. వానాకాలంలో వేసుకున్న పత్తి ఏరేందుకు, వరి కోతలకు కూలీల కొరత ఎదురవుతోంది. ఈ కారణంగా కూడా రైతులు వరి సాగుకు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

సాగు నీటిపై ఆందోళన

యాసంగిలో అధికంగా వరి సాగవుతుంది. ఇప్ప టికే వరినాట్లు పూర్తికావాల్సి ఉండగా వానాకాలం పంటలు ఆలస్యం కావడంతో దాని ప్రభావం యాసంగి సాగుపై పడింది. యాసంగిలో 95 శాతం దొడ్డు రకం వరిసాగు చేస్తారు. వరి తర్వాత మొక్క జొన్న, శనగ, కంది పంటలు సాగవుతాయి. జిల్లా నీటి వనరులు కడెం ప్రాజెక్టు డెడ్ స్టోరీజీ చేరడంతో ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించారు. గూడెం ఎత్తిపోతల పథకం నుంచి డిస్ట్రిబ్యూటరీ 30 నుంచి 42 వరకు 2 టీఎంసీల నీటిని 90 రోజులు వారబందీ పద్ధతిలో 15 వేల ఎకరాలకు మాత్రమే అందిస్తు న్నారు. దీంతో వరి సాగుకు రైతులు వెనుకాడుతు న్నారు. బోర్లు, బావులు ఉన్నవారు మాత్రం మొక్క జొన్న సాగు చేస్తున్నారు.



సీఎంఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

వరిధాన్యం సీఎంఆర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమారెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పౌర సరఫరాల శాఖ కమీషనర్ డీఎస్.చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మిల్లులకు చేరుకొని పట్టించిన ధాన్యాన్ని సీఎంఆర్ డెలివరీస్ కింద భారత ఆహార సంస్థకు ఇవ్వవలసిన ధాన్యాన్ని సకాలంలో అందించాలని తెలిపారు. జిల్లాల వారిగా మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా తప్పనిసరిగా మిల్లింగ్ చేసి సకాలంలో పంపించాలని, సీఎంఆర్ ప్రక్రియలో రీసైక్లింగ్ బియ్యం రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దృష్యా ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలు, నూతన రేషన్ కార్డులు, పెన్షన్‌ల కొరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని తెలిపారు. రేషన్‌కార్డు దరఖాస్తుకు సంబంధించి వివరాలు నమోదు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, కుటుంబం పెద్ద అయినప్పుడు వారి నుంచి 2/3 దరఖాస్తులు వచ్చినట్లయితే తప్పనిసరిగా పరిశీలించి సరైన వివరాలు కలిగిన దరఖాస్తులు పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో డిసెంబర్ 28, 2023 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు అందిన అన్ని దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 17వ తేదీ లోగా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా దరఖాస్తులో పొందుపరిచిన సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. ఈ విధానంపై తహసీల్దార్లు, మున్సిపల్ వార్డు అధికారులు, ఎంపీడీఓలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్, సబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

పశుమిత్రలకు కనీస వేతనం చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్



నవతెలంగాణ-నస్పూర్

పశుమిత్రులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. సోమవారం పశు మిత్ర వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పశు మిత్రల సమస్యలు పరిష్కరించాలని పశుమిత్ర వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి, కోశాధికారి నాగమణి, లావణ్యలతో కలిసి కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకేపీ ద్వారా గత ప్రభుత్వం శిక్షణ ఇచ్చిందని, గత 8 ఏళ్లగా గ్రామాల్లో రైతులకు ఉన్న పశువులు అనారోగ్య బారిన పడితే వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం ఎలాంటి వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం ఆలోచించి మాకు న్యాయం చేయాలని, కనీస వేతనాలు, పీఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పశుమిత్రల సమస్యలు పరిష్కరించడంలో గత రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పశు మిత్రల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఆందోళన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సరోజ, శ్యామల, సరిత, రమ్య, శైలజ, శారదా, స్వప్న, జ్యోతి, రజిత పాల్గొన్నారు.

ఇంటింటా హనుమాన్ చాలీసా నిత్య పారాయణం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటా హనుమాన్ చాలీసా నిత్య పారాయణం సోమవారం నిర్వహించారు. 3670వ రోజు కాంగ్రెస్ నాయకులు బొప్పు సతీష్ ఇంట్లో నిర్వహించారు. అయోధ్య అక్షింతల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఆధ్యాత్మికత పెరుగుతుందని అన్నారు. అదేవిధంగా హనుమాన్ చాలీసా భక్త బృందానికి రూ.5016 అందజేశారు. గాంధీ నగర్ కాలనీ వాసులు, మహిళలు అయోధ్య అక్షింతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి జడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి, గడ్డం శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో డిసెంబర్ 28, 2023 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, ఈ నెల 6 నుంచి 17వ తేదీలోగా స్వీకరించిన దరఖాస్తుల వివరాలను పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందుకు నమోదు విధానంపై తహసీల్దార్లు, మున్సిపల్ వార్డు అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఆన్‌లైన్‌లో పొందుపరిచే సమయంలో వార్డుల వారిగా దరఖాస్తు సంఖ్య నమోదు చేసిన అనంతరం కులం, పుట్టిన తేదీ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా ఇతర వివరాలతో కూడిన ఆన్‌లైన్ ఫారంను ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తుఫారములో ఉన్న ప్రకారంగానే నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. డాటా ఎంట్రీ చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఒక్కరు నిబద్ధతతో పని చేసి ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీలకు విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-జన్నారం

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని స్లేట్ ఎక్సలెంట్ సీబీఎస్ఈ స్కూల్ 8వ తరగతి చదువుతున్న విద్యార్థి బొమ్మిడి రిషి వర్మ ఎంపిక అయ్యాడు. ఇటీవల ఆసిఫాబాద్‌లో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచినందుకు ఈనెల 16 నుండి 18 వరకు నిజామాబాద్ లోని ఆర్మూర్ మండలంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనటువంటి విద్యార్థిని ప్రిన్సిపాల్ యేసు మరియా, అడ్మినిస్ట్రేషన్ రజిత, పీఈటీలు సంతోష్, నాగేష్, రమేష్, నాగలక్ష్మి అభినందించారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి రాములుతో కలిసి ప్రజావాణి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వంలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ 10 రోజుల లోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రాష్ట్ర స్థాయిలో జిల్లాకు చెందిన సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లయితే సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేందుకు కార్యచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. సుమారు 70 దరఖాస్తులు అందాయని, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు లూయిస్ బ్రెయిలీ జయంతి

నస్పూర్ : కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ ఉదయం 10.30 గంటలకు జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి కె.చిన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, దివ్యాంగ సిబ్బంది, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | జనవరి 09, 2023 | www.navatelangana.com

పెన్షనర్స్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ డైరీ, క్యాలెండర్‌ను సోమవారం మాజీ మంత్రి జోగురామన్న ఆవిష్కరించారు. సోమవారం అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను మర్యాద



పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సబ్ ట్రెజరి ఆఫీసర్ నరేష్‌తో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.శశికాంత్, అధ్యక్షులు దయాకర్ రెడ్డి, సభ్యులు గోలి రాజన్న, గంగాధర్, అశోక్ వైద్య, బాపురావు, దిలీప్, వెంకట్ స్వామి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని రిమాండ్‌కు పంపడం సరికాదు

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ప్రతాప్‌సింగ్‌ను బాలికను ఇబ్బంది పెట్టాడని అరెస్టు చేసి రిమాండ్ పంపడాన్ని టీటీఫ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రవీందర్ ఖండించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ఏదైన సమస్య ఉత్పన్నం చేస్తే సంబంధిత అధికారులు కమిటీ ద్వారా నిజనిర్ధారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కానీ ఒక్క రోజులోనే ఎలాంటి విచారణ చేయకుండా రిమాండ్‌కు పంపడం సరికాదన్నారు. జిల్లా విద్యాధికారితో న్యాయ విచారణ చేసిన తర్వాతనే కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపాల్సి ఉండగా, పోలీసులు ఎలాంటి విచారణ చేయకుండా అరెస్టు చేయడంతో ఉపాధ్యాయుడు తన సర్వీస్ కాలాన్ని కోల్పోయే ప్రమాదముందని తెలిపారు. ఈ విషయంలో కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిణి పునరాలోచన చేయాలని కోరారు. ఆయన వెంట టీటీఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ జాదవ్, ఇతర నాయకులు ఉన్నారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఆయన దరఖాస్తులను స్వీకరించారు. ధరణి, ఆసరా, రెండు పడక గదుల ఇండ్లు, తదితర సమస్యలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ఖుష్బుగుప్త, శ్యామలాదేవి, ఆర్డీఓ స్రవంతి, మైనార్టీ సంక్షేమ అధికారి రాథోడ్ రమేష్, డీఆర్డీఓ కిషన్, డీపీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ శైలజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బౌద్ధ ధమ్మ ధ్వజ దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని భుక్తాపూర్ మహాప్రజ్ఞా బుద్ధ విహార్‌లో బౌద్ధ ధమ్మ ధ్వజ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉత్తర తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నఝుడే ప్రజ్ఞా కుమార్ హాజరయ్యారు. గౌతమ బుద్ధుడు, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం బుద్ధ వందన సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధమ్మ ధ్వజము బౌద్ధ ధర్మానికి ప్రతినిధిగా ఉంటుందని, ధమ్మ ధ్వజం ప్రపంచంలోనే శాంతికి ప్రత్యేకత అని కొనియాడారు. ప్రతి ఒక్కరు బౌద్ధ ధమ్మని అనుసరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాప్రజ్ఞా బుద్ధ విహార్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రత్నజాడే ఉదయ్ కుమార్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా నాయకులు రాహుల్ రావడే, రమాబాయి అంబేద్కర్ మహిళా మండల్ నాయకురాలు పూజా థాయిడే, ఎస్సీఆర్‌పీఎస్ జిల్లా యూత్ ఉపాధ్యక్షులు రాజు పటాడే, రాహుల్ తాడే, అర్చన సుగుదేవే, అర్పిత జుగునాకే, వైష టామ్గాడిగే, హినాసగ్దేవే, చంద్రకళ రత్నజాడే, ఆకాంక్ష రత్నజాడే పాల్గొన్నారు.

బానయ్య కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని ఎలుకపెల్లి గ్రామానికి చెందిన జంగంపల్లి బానయ్య అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న సోమవారం బెజ్జూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బెజ్జూరు మండల కాంగ్రెస్ నాయకులు చండే బాబురావు, మూర్ల గంగయ్య, హనుమంతు, అబ్దుల్ రషీద్, శైలజారి శ్రీకాంత్, విష్ణుమూర్తి, వినోద్ పాల్గొన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జి.రాజేష్‌ఇంద్ (ఏఈఈ పీఆర్ ఇచ్చోడ), ప్రధాన కార్యదర్శిగా ఎండీ సలావుద్దీన్ (ఏఈఈ పీఆర్ ఆదిలాబాద్), ఉపాధ్యక్షుడిగా ఆర్ శివరాం, (డీఈఈ పీఆర్ తాంసి), సంయుక్త కార్యదర్శిగా జె.లింగన్న(ఏఈఈ పీఆర్ ఉట్నూర్), కోశాధికారిగా ఎండీ మజార్ అలీ(ఏఈఈ తలమడుగు) ఎన్నికయ్యారు.

జోరుగా కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదు

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలో ప్రజాపాలన దరఖాస్తు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. గ్రామపంచాయతీ కార్యాలయంలో కంప్యూటర్లను ఏర్పాటు ఆన్‌లైన్‌లో వాటిని నమోదు చేస్తున్నారు. అధికారులు వాటిని పరిశీలిస్తు డాటా ఎంట్రీ ఆపరేటర్లకు పలు సూచనలు చేస్తున్నారు. ఇచ్చిన గడువులోగా నమోదను పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అంజిత్, గంగాధర్, నవీన్, చంద్రమోహన్ ఉన్నారు.

రాములోరి అక్షింతల పంపిణీ

నవతెలంగాణ-నార్నూర్

అయోధ్య నుంచి వచ్చిన శ్రీ రాముని అక్షింతలు ఉమ్రి గ్రామ పెద్దలు భక్తులు నార్నూర్ నుంచి తీసుకెళ్లారు. సోమవారం ఆలయంలో పూజారి ద్వారా ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రామ నామస్మరణతో అక్షింతలను పంపిణీ చేశారు. సర్పంచ్ రాథోడ్ రవీందర్, గ్రామ నాయక్ జితేందర్, గ్రామ పెద్దలు రాజు, యూత్ సభ్యులు జాదవ్ గజానంద్, ధను నాయక్ ఉన్నారు.

ఉట్నూర్ : పట్టణంలోని సుభాష్ నగర్, శాంతినగర్‌లో శ్రీ రామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో వచ్చిన అయోధ్య రాములోరి అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. 22న తమ తమ ఇంట్లో పూజలు జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామప్రజలు, మహిళలు ఉన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-ఖానాపూర్

ఉద్యోగాలు, సినిమాల్లో అవకాశాల పేరిట మహిళలను దారుణంగా మోసం చేస్తున్నారని అలాంటి వారి పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సీడీపీఓ సరిత అన్నారు. సోమవారం ఖానాపూర్ పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళల అక్రమ రవాణా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణా అనేది ప్రపంచంలోని అతి పెద్ద నేరమని అన్నారు. ప్రతిరోజు ఎంతోమంది అమ్మాయిలు, మహిళలు అపహరణకు గురవుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ దీని పైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రావ్య మాట్లాడుతూ అక్రమ రవాణాకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ గత 28 సంవత్సరాలుగా పద్మ శ్రీ డా.సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిషు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యా శాఖ, న్యాయ శాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 28వేల 200 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికీ పునరావాసం కల్పించారని అన్నారు. అనుమానస్పద వ్యక్తుల నుంచి మెసేజ్‌గాని కాల్స్‌గాని వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా అలా ఇబ్బందికి గురైన సందర్భాలలో 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలనీ అన్నారు. ఈ లైంగిక వ్యాపారానికి పేద, మధ్య తరగతి, మారుమూల గ్రామాల యువతులను ఉద్యోగం, సినిమా అవకాశాలు, డబ్బు ఆశతో మభ్యపెట్టి తీసుకెళ్లి వ్యభిచార గృహలకు అమ్ముతున్నారనీ అన్నారు. ఇలా వ్యభిచారాల వృత్తిలోకి వెళ్లిన వారు అక్కడ చాలా దుర్బర స్థితిలో చనిపోతున్నారని అన్నారు. ఈ శిక్షణలో అంగన్‌వాడీ టీచర్‌లకు లఘు చిత్రల ద్వారా అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల కోఆర్డినేటర్ సురేష్ కుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర్స్ శివ, అనిల్, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన అభయహస్తం దరఖాస్తులు పొరపాట్లకు తావు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లకు సూచించారు. సోమవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో స్పష్టంగా నమోదు చేయాలన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలు, నూతన రేషన్ కార్డులు, పెన్షన్‌లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల నమోదుపై డాటా ఎంట్రీ ఆపరేటర్లకు అవగాహన కల్పించామని ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. దరఖాస్తు సంఖ్య, కులం, పుట్టిన తేదీ, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా ఇతర వివరాలతో కూడిన ఆన్‌లైన్ ఫారంను ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తుఫారంలో ఉన్న ప్రకారంగానే నమోదు చేసే విధంగా సూచనలు చేశామన్నారు. 6 నుంచి ప్రారంభమైన ప్రక్రియను 17లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా జిల్లాలోని రైస్ మిల్లర్లకు నిర్దేశించిన సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ల సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టరులు ఖుష్బు గుప్త, శ్యామలాదేవి, జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సుధారాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

- శాఖల వారీగా కలెక్టర్ సమీక్ష సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అధికారులు నిబద్దతో పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శాఖల వారిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సంక్షేమ, ఇంజనీరింగ్, తదితర శాఖలు చేపట్టే పనులపై ముందస్తు ప్రణాళికలు రూపొందించి నివేదికలను సమర్పించాలని సూచించారు. పరిశ్రమల శాఖపై సమీక్షిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధికల్పనకు సబ్సిడీ రుణాల కోసం అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేసి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 3 యూనిట్లను రూ.7.81 లక్షల సబ్సిడీతో మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.

జనవరి 17 వరకు ఆన్ లైన్ నమోదు పూర్తి

నూతన ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అమలు చేసే ఐదు గ్యారంటిలపై సీఎం రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారని కలెక్టర్ రాహుల్ తెలిపారు. అందులో భాగంగాను తొలుత ప్రజాపాలన ద్వారా దరఖాస్తులను స్వీకరించామన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల 25 వేల దరఖాస్తులు వచ్చాయని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. జనవరి 17 వరకు ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. తరువాత అర్హుల ఎంపిక ఉంటుందన్నారు. ఇచ్చిన లక్ష్యం కంటే వేగంగా ఆన్‌లైన్ నమోదు జరుగుతుందన్నారు. శాఖల అధికారులు కూడా వారి యాక్షన్ ప్లాను తయారు చేసుకోవాలని ఆదేశించారు. ప్రతి పేదోడికి ప్రభుత్వం ద్వారా ఫలాలు అందేల చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బుగుప్తా, శ్యామల దేవి, ఆర్డీవో స్రవంతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి : పీడీఎస్‌యూ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేవలం ర్యాంకుల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తూ వాళ్ల జీవితాలతో చెలగాటం ఆడుతున్నా కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, అశోక్ డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్నటువంటి కార్పొరేట్ విద్యాసంస్థలు అనుమతి లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కేవలం ఫీజుల దోపిడీ చేయడం లక్ష్యంగా నడుస్తున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా సోమవారం వారు నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఒకటి, రెండు ర్యాంకులను చూపిస్తూ, ఫ్లెక్సీలతో కరపత్రాలతో మైమరిపిస్తు విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని అన్నారు. అయిన విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం సరైంది కాదన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థులను ప్రభుత్వ విద్యాసంస్థలలో చేర్పించి, బలోపేతం చేయాలన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న ఫీజుల దోపిడిని అరికట్టాలన్నారు. మావలలోని ప్రయివేట్ పాఠశాలలోని ప్రిన్సిపాల్ చదువు కోవడానికి వచ్చిన మైనర్ అమ్మాయిలకు లైంగికంగా, వేకిలి చేష్టలు చేయడంతో విద్యార్థులు మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు.

కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీజేపీ రాష్ట్ర కార్యాల యంలో రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర పదధికా రుల సమావే శాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామా బాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారా యణకు కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జిగా బాధ్యతలు అప్పగించారు. లోక్‌సభ ఎన్నికలలో పార్టీ కోసం కష్టపడి అభ్యర్థి గెలుపు కోసం పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. పార్టీ ఇచ్చిన బాధ్యతలను తూచా తప్పకుండా పనిచేసి కరీంనగర్ పార్లమెంట్‌లో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తానని అన్నారు. కేంద్రంలో మరోసారి మోడీ సర్కార్ రాబోతుందని అన్నారు. ప్రజలంతా బీజేపీ వైపు ఉన్నారని తెలిపారు.

తీగలు తగిలి ఐచర్‌లో పత్తి దగ్ధం



నవతెలంగాణ-నార్నూర్

కరెంట్ తీగలు ఐచర్‌లో పత్తి దగ్ధం అయిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మెయిన్ రోడ్డుపై సోమవారం పత్తిని తీసుకెళ్తున్న ఐచర్ వ్యాన్‌కు కరెంటు తీగలు తగిలి నిప్పులు వచ్చాయి. దీంతో వ్యాన్‌లో ఉన్న పత్తి కలిపోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజలింగు, సర్పంచ్ రాథోడ్ సుభద్ర బాయి రామేశ్వర్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కొత్తపెల్లి-హెచ్ గ్రామానికి చెందిన జాడే భీంరావ్ పత్తిని అమ్మడానికి తీసుకెళ్తున్నారు. ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి 90 క్వింటాళ్ల పత్తి దగ్ధం అయిందన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పత్తిపంట కళ్లముందే కాలిపోవడంతో రైతు కన్నీంటి పర్యంతమయ్యాడు. నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాదిత రైతు కోరాడు. ఈ సంఘటనపై విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌ను ఫోన్ ద్వారా సంప్రదించడానికి యత్నించిన ఎలాంటి స్పందన రాలేదు.

జాతీయస్థాయి కథల పోటీల్లో 'విజయ్' విద్యార్థి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బాలసాహిత్య పురస్కారానికి బడిపిల్లల రచనల్ని ప్రోత్సహించడానికి, భాషాసాహిత్యం పట్ల అభిరుచిని, ఆసక్తిని పెంచడానికి, పాఠ్యాంశంలో ఉన్న స్వీయరచన సామర్థ్యాన్ని పెంపొందించడానికి గానూ మాచిరాజు బాల సాహిత్య కథల పురస్కారానికి విజయ్ హైస్కూల్లో 8వ తరగతి చదివే ఎస్.హారిక రాసిన 'స్నేహితురాలి త్యాగం' అనే కథ జాతీయస్థాయి కథల పోటీలకు ఎంపికైనట్లు సంస్థ వ్యవస్థాపకులు, చందమామ కథకులు రిటైర్డ్ బ్యాంక్ ఆఫీసర్ మాచిరాజు కామేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డా. అమృతలత ఎస్. హారికను అభినందించారు.

చీరలే.. పంటకు రక్షణ

నవతెలంగాణ-బాల్కొండ

పంటల రక్షణ కోసం రైతులు నానాయాతన పడుతున్నారు. ముఖ్యంగా అడవి పందుల భారీ నుంచి పంటలను కాపాడుకోవడానికి రైతులు వివిధ రకాల పద్ధతులను అవలంబిస్తున్నారు. మొక్కజొన్న పంటకు అడవి పందుల తాకిడి ఎక్కువైంది. వాటి నుంచి రక్షణ కొరకు రాత్రిళ్లు పంటలను మెరిసే వైర్లు, చీరలను పంటకు చుట్టూరా కట్టి మొక్కజొన్న పంటను కాపాడుకుంటున్నారు. బాల్కొండ మండల పరిధిలోని చిట్టాపూర్ శివారు ప్రాంతంలో జంగం అనిత అనే మహిళా రైతు చీరలను కట్టి మొక్కను రక్షించుకుంటున్నారు. వానకాలంలో మక్క పంటను అడవి పందులు ధ్వంసం చేసి 40 వేల రూపాయలు ఆర్థిక నష్టం కలిగించడంతో ఈ మహిళా రైతు ముందు జాగ్రత్తగా చీరలను కట్టి మక్కను రక్షిస్తున్న తీరు చూపరులను ఆకట్టుకుంటుంది. ఆమె చిరు ప్రయత్నం రైతులకు ఆదర్శంగా నిలుస్తుంది.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ధర్పల్లి

పిఆర్‌టియు 2024 క్యాలెండర్‌ను ఎంపిడిఓ కొండా లక్ష్మణ్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిఆర్‌టియు సంఘం చేపడుతున్న సేవలను కొనియాడారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవలు చేస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షులు వెంకట్ రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, ప్రసన్న కుమార్, వినోద్‌కుమార్, సత్యనారాయణ, ప్రవీణ్‌రెడ్డి, సుజాత, స్నేహలత , గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్లను పెంచాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆధార్ సెంటర్లను పెంచడంతోపాటు, గతంలో ఆధార్ అనుసంధానం కొరకు అవకాశం ఇచ్చిన మీసేవ కేంద్రాలకు ఆధార్ అప్డేట్‌ను ఇస్తేనే ప్రజల ఇబ్బందులు తగ్గుతాయని సిపిఐ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని కె.రాజన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాలకు, రేషన్ బియ్యానికి, బ్యాంకులలో ఖచ్చితంగా కేవైసీ చేయించాలని నిర్ణయించిన తర్వాత ఆధార్ సెంటర్లలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, జిల్లాలో ఆధార్ సెంటర్‌లు తక్కువగా ఉండడం వల్ల ఆధార్ సెంటర్ల సిబ్బంది ప్రజలకు కేవలం రోజుకు 50 మందికి మాత్రమే టోకెన్లు ఇవ్వడంతో వరుసగా రోజుల తరబడి ఆధార్ అనుసంధానం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. జిల్లాలలో మరింత ఆధార్ కేంద్రాలను పెంచి ప్రజల ఇక్కట్లు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు ప్రతి పథకానికి పెద్దలకు, విద్యార్థులకు ఆధార్ అనుసంధానంతో పాటు గతంలో ఆధార్‌లో దొర్లిన చిన్నతప్పులను సవరించడం కోసం రోజుల తరబడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని కావున వెంటనే ఆధార్ సెంటర్‌ను పెంచాల్సిందిగా సిపిఐ జిల్లా కౌన్సిల్‌గా రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో 300 ఆధార్ సెంటర్ ఉంటే అన్ని జిల్లాలలో కేవలం 150 ఆధార్ సెంటర్లు మాత్రమే ఉండటంతో ఆధార్ కార్డుల జారీ, సవరణలకు ఆలస్యమవుతుందని ఇప్పటికైనా ప్రభుత్వం మీసేవ నిర్వాహకులకు ఆధార్ అనుసంధానం అవకాశం ఇస్తేనే త్వరితగతన పూర్తవుతుందని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య, ఏ.రాజేశ్వర్, పి.రంజిత్, బొంబాయి గంగారం, రామ్‌దాస్, రఘురాం ఆయా శాఖల అదికారులు, తదితరులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

నవతెలంగాణ-వర్ని

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని ఎస్ఎన్‌పురం కోటయ్య క్యాంప్‌లో చోటుచేసుకుంది. వర్ని ఎస్ఐ కృష్ణ కుమార్ వివరాల ప్రకారం.. కోటయ్యక్యాంప్‌నకు చెందిన షేక్ నాజర్ వలీ (36) కూలీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. రోజంతా పనిచేసి వచ్చిన డబ్బులతో మద్యం సేవించేవాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు చోటుచేసుకునేవి. అయితే నాజర్‌కు తన భార్య పిల్లలతో కలిసి దూరంగా ఉంటోంది. దీంతో మనస్థాపం చెందిన నాజర్ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తమ్ముడు షేక్ బాజీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.